

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ గోదావరి జిల్లా

శనివారం, 9 ఆగస్టు 2025

8 పేజీలు


## మైసూర్ ఉత్సవాలు తలపించేలా

# నూజివీడు దసరా ఉత్సవాలు

– సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి కొలుసు పార్థసారథి



**నూజివీడు,మేజర్‌న్యూస్:**నూజివీడు పట్టణంలో జరిగే దసరా ఉత్సవాలపై పట్టణ కిరాణామర్చంట్ అసోసియేషన్ హాల్ నందు అధికారులు, నాయకులు,కమిటీ సభ్యులతో,రాష్ట్రగృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి సమీక్షించారు.మంత్రి మాట్లాడుతూ ప్రతీ ఏడాది జరిగే విధంగా ఘనంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. మైసూర్ ఉత్సవాలు తలపించేలా నూజివీడు ఉత్సవాలు నిర్వహించాలని మంత్రి నాయకులకు, అధికారులకు చూసించారు. దసరా ఉత్సవాల్లో ఎటువంటి ఆటంకాలు,ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగ కుండా, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి దసరా ఉత్సవాలు, ఘనంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు, త్రాగునీరు, అందుబాటులో

- తరువాయి 2లో..

## ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

: ఎంపి మహేష్ కుమార్



**దిల్లీ/ఏలూరు,మేజర్‌న్యూస్:** వెలకట్టలేని ఆప్యాయత, అందమైన అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. సొంత అన్నలా, తమ్ముడిలా నన్ను ఆదరిస్తున్న పార్లమెంటు నియోజకవర్గంలోని నా అక్క చెల్లెళ్ళు అందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు.

మొదటి నుంచి మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే తెలుగుదేశం పార్టీ, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని కూడా మరి కొద్ది రోజుల్లోనే (అగస్టు 15 నుంచి) అమలులోకి తీసుకువస్తున్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా నేను మీకు గుర్తు చేస్తున్నాను. మీరందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటూ, మీకు ఏ కష్టం వచ్చినా నేను అండగా ఉంటానని తెలియజేస్తూ నా సోదరీమణులందరికి మరోసారి రాఖీ పండుగ శుభాకాంక్షలు.

# అమ్మవారి గర్భాలయానికి వెండి తొడుగు తలుపులు

**కైకలూరు,మేజర్‌న్యూస్** : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్,శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ శ్రావణమాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా కైకలూరులో కొలువైఉన్న శ్రీశ్యామలాంబ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసినారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరారు. అనంతరం 20మంది దాతల సహకారంతో 16కేజీలు వెండితోఅమ్మవారి గర్భాలయానికి ఏర్పాటు చేసిన వెండి తొడుగు తలపులను పూజ చేసి ప్రారంభించారు.ఈ కార్య క్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు,దేవస్థానం ఈవో,ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్,కొల్లి వరప్రసాద్ (బాబి)



పూలరామచంద్రరావు(రాజి) త్రినాధరాజు,పడమట వాసు ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు,అమ్మవారిభక్తులుతదితరులు పాల్గొన్నారు.



## జి.కొత్తపల్లిలో 3 టన్నుల 750 కిలోల

# రేషన్ బియ్యం స్వాధీనం

**ద్వారక తిరుమల,మేజర్‌న్యూస్** : నిరుపేద కుటుంబాలకు అందవలసిన రేషన్ బియ్యం అక్రమార్కులు దర్జాగా ద్వారకాతిరుమల మండలం. జి.కొత్తపల్లి గ్రామంలో ఒక ఇంట్లో సుమారు 3 టన్నుల 750 కేజీల పిడిఎస్ రైస్ ఉన్నట్లు, సమాచారం తెలుసుకున్న ద్వారకాతిరుమల రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు.

రేషన్ బియ్యాన్ని మాటూరు దుర్గారావు అనే వ్యక్తి నిలవ చేసిన రైస్‌గా, గుర్తించి రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు, రేషన్ మాఫియాలు గ్రామీణాప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి రూ.10 నుంచి రూ.12కు కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని సమీపంలోని సీక్రెట్ ప్రాంతాల్లో ఖాళీగా ఉంటున్న నివాసాలను అద్దెకు తీసుకుని నిల్వ చేసి రాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్నారు చుట్టుపక్కల వారు సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వడంతో ద్వారక తిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చేరుకుని నిల్వచేసిన ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.




# నూతన వంతెన నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి





**– ఎటపాక నుండి కన్నాయిగూడెం వరకు రహదారి మరమ్మతులు చేపట్టాలి**
**– బీజేపీ నాయకులు మూడే సతీష్**

**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలో నూతన వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని బీజేపీ రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు మూడే సతీష్ కుమార్ నాయక్ కోరారు. శుక్రవారం ఎటపాక మండల కేంద్రంలో బొజిగుప్ప గ్రామస్తులుతో మరమ్మతులు గురైన వంతెన వద్ద నిరసన చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఇసుక లారీలు ఓవర్ లోడ్‌తో వెళ్లడం వల్ల కన్నాయిగూడెం నుండి ఎటపాక వరకు రోడ్లు గుంతలుపడి వాహనాలు తిరగలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని నాథుడే లేడు. బైకులు, ఆటోలు, ఇతర వాహనాలు తిరగడానికి స్థలం లేకుండా నిరంతరాయంగా తిరుగుతున్న లారీల వల్ల వచ్చే దుమ్ము ధూళి రహదారి మొత్తం కమ్ముకొని అనారోగ్యాలు పాలవుతూ, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని వారు తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కల్పించుకొని చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన ప్రభుత్వాన్ని కోరడమైనది. లేనిపక్షంలో ఎటపాక నుంచి కన్నాయిగూడెంలో మధ్యలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలు రహదారిలో కూర్చొని నిరసనలు, ధర్నాలు చేయవలసిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఇసుక లారీలు అధిక లోడుతో ఆ రహదారిపై ప్రయాణం చేయడం వలన రోడ్లు మరమ్మత్తులకు గురి అవడం జరిగింది అని, ఆ లారీలు ఈ రహదారిపై ప్రయాణం చేయకుండా చర్యలు చెప్పటాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాయం బాబురావు, ఉకే రమేష్, ఉకే బాబు, మడకం రాజు, తెల్లం శ్రీను, మడకం వెంకటేష్, సోడే శేఖర్, కారం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరప్పాడు వెంకన్న ఆలయ ధర్మకర్తల నియామకం కొరకు నోటిఫికేషన్

**పెరవలి, మేజర్ న్యూస్ :** అన్నవరప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానమునకు 2 సంవత్సరముల కాలపరిమితికి గాను 11 మంది పాలకమండలి సభ్యుల నియామకము కొరకు ధర్మకర్తల మండలి నోటిఫికేషన్ విడుదల చేశారని ఆలయ కార్య నిర్వహణ అధికారి కార్యదర్శి మీసాల రాధాకృష్ణ తెలియజేశారు. ఆగస్టు 8వ తేదీ శుక్రవారం మేజర్ న్యూస్‌తో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ధార్మిక పరిషత్తు ద్వారా ది



07/08/2025 తేదీన ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారని ఆయన తెలియజేశారు. కావున ఆసక్తి కలిగినటువంటి హిందూ మతమునకు చెందినవారు 20 రోజుల లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు ఫారాలు మిగతా వివరముల కొరకు ఆలయ పనివేళలో అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయంలో తెలుసుకొనవలసినదిగా ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ కోరారు.

# మంత్రి, కలెక్టర్ దృష్టికి పెరవలి మినీ రైతుబజార్ భవన దుస్థితి



పెరవలి, మేజర్‌న్యూస్ : పెరవలి గ్రామంలో తాసిల్దార్ కార్యాలయానికి సమీపంలో నిడదవోలు నరసాపురం రహదారి ప్రక్కన ఎనిమిది సంవత్సరాల క్రితం అప్పటి పెనుగొండ మార్కెట్ కమిటీ నిధులు సుమారు పది లక్షల రూపాయలతో మినీ రైతుబజార్ భవనాన్ని నిర్మించారు. తదనంతర పరిణామాలలో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పెనుగొండ వ్యవసాయ మార్కెట్ ను రెండు భాగాలుగా చేసి నిడదవోలు నియోజకవర్గం సంబంధించి నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీని నూతనంగా ఏర్పాటు చేశారు. తదుపరి పెరవలి సెంటర్లో ఉన్న వ్యవసాయ మార్కెటింగ్ చెక్ పోస్ట్ నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోకి వచ్చింది. అయితే మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించిన మినీ రైతు బజార్ ను అనేక కారణాలవల్ల ఏళ్ల తరబడి ప్రారంభించకుండా వదిలేయడంతో దాని పక్కన పెరవలి గ్రామానికి సంబంధించిన చెత్తను వేస్తూ ఉండటంతో ఆ ప్రదేశం డంపింగ్ యార్డ్ వలే తయారయింది. దీనిపై పెరవలి మండల వశిష్ట వినియోగదారుల సంఘం లోగడ అనేకమంది అధికారులు దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తాజాగా ఆగస్టు 7 వ తేదీ గురువారం పెరవలి అభయాంజనేయ స్వామి సెంటర్లో ఉన్న నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ కు డిజిటల్ పేమెంటు విధానాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి ల దృష్టికి ప్రారంభానికి నోచుకోని మినీ రైతు బజార్ దుస్థితిని పెరవలి మండలం వశిష్ట వినియోగ సంఘం అధ్యక్షులు సలాది ఉదయభాస్కరరావు తీసుకుని వచ్చారు. చిన్నపాటి మరమ్మత్తులతో ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి రైతు బజార్ ను ప్రారంభించాలని తద్వారా రైతులకు తాము పండించిన కూరగాయలను అమ్ముకోవడానికి స్థానిక ప్రజలకు తాజా కాయగూరలు అందుబాటు ధరలో దళారుల ప్రమేయం లేకుండా కొనుక్కోవడానికి ఉపయోగంగా ఉంటుందని మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి గార్ల దృష్టికి తీసుకువచ్చారు.

దీనిపై స్పందించిన మంత్రి దుర్గేష్ ఈ విషయాన్ని పరిశీలించమని కలెక్టర్ ను కోరారు. కలెక్టర్ ప్రశాంతి ఈ విషయం అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని పెరవలి మండల వశిష్ట వినియోగదారుల సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెరవలి మండల స్పెషల్ ఆఫీసర్ సునీల్ వినయ్, తాసిల్దార్ కే నిరంజన్, ఇంచార్జ్ ఎంపీడీవో గంటా శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పులిదిండి పావని, పెరవలి సర్పంచ్ గంగోలు సీతమ్మ జోసెఫ్, ఇతర అధికారులు, అనధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బు స్వాహా చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఉద్యోగాలు ఇప్పిస్తామని దాదాపు 20 మంది వద్ద నుండి 49 లక్షల రూపాయలను కాజేసిన జాలాది రామచంద్రరావు అనే వ్యక్తి పై ఏలూరురెండో పట్టణ పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏలూరు ఆర్‌ఆర్ పేటకు చెందిన శ్రీలక్ష్మి అనే మహిళ వద్ద నుండి ఆమె కుటుంబ సభ్యుల వద్ద నుండి ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి దఫ దఫాలుగా రామచంద్రరావు డబ్బులను కాజేసాడని ఫిర్యాదులో పేర్కొన్నారు . బాధితులు శుక్రవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మైసూర్ ఉత్సవాలు తలపించేలా నూజివీడు దసరా ఉత్సవాలు

మొదటిపేజి తరువాయి

ఉంచాలని, మెడికల్ క్యాంపు నిర్వహించాలని. నాయకులు, ప్రభుత్వ ఎంత్రాంగం, కమిటీ సభ్యులు అంతా కలిసి సమన్వయంతో పనిచేసి దసరా పండుగను విజయవంతం చేయాలని మంత్రి అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పి.సత్యనారాయణ,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఆర్,మురళీ కృష్ణ కుమార్,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎమ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలాభివృద్ధికి మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలి

**– ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**





**పెదపాడు,మేజర్‌న్యూస్ :** పెదపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైన్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తనిఖీ చేశారు. శుక్రవారం పండగ సెలవు రోజు కావడంతో ప్రభుత్వ అధికారులు,స్థానిక సిబ్బంది ఎవరికి కూడా ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ఉండాలని ఎమ్మెల్యే భావించి స్వయంగా తానే రంగంలోకి దిగి స్థానిక కాలనీలో స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. శనివారం ఈఅంశంపై అధికారులు సిబ్బందితో సమీక్షించి త్వరితగతిన కాలనీలో సమస్యల పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతామని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. గ్రామాల్లో డ్రైన్లు, రోడ్ల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తున్నామని,డ్రెయిన్లు మరమ్మత్తులు చేపట్టడంతో పాటు గ్రామాల్లో ఉన్న కాలనీలో పూర్తి అద్వాన స్థితిలో ఉన్న డ్రెయిన్లును,అదేవిధంగా సుపరిపాలల్లో తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే చింతమనేని తెలిపారు. పెదపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇటీవల జరిగిన సుపరిపాలంలో తొలి అడుగు కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు డ్రైన్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సత్వరమే సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తమ సమస్యను చెప్పిన వెంటనే స్పందించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే చింతమనేనికి స్థానిక కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# అధ్వానంగా తయారైన పుంత రోడ్లు





**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పొలాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని రైతులు అంటున్నారు. ప్రభుత్వం మారినా రోడ్ల దుస్థితి మారలేదని రైతులు వాపోతున్నారు. కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరంగపట్నం నుండి బర్కిట్ నగరం వెళ్లే పుంత రోడ్డు గజానికి గొయ్యి పడి రైతుల వెన్నుముక విరుస్తుంది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీరంగపట్నం నుండి బర్కిట్ నగరం పరిసర ప్రాంత రైతులు నిత్యము పుంత రోడ్డు మార్గం ద్వారానే పొలాలకు వెళ్లి వస్తుంటారు. అచ్యుతాపురం త్రినాధపురం వంటి గ్రామాల నుండి నిత్యం పదుల సంఖ్యలో కూలి పనికి వెళ్లే వచ్చేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. పొలాల్లో పండించినటువంటి వరిధాన్యం ,మొక్కజొన్న ,కూరగాయలు వంటి వాటిని రవాణా చేసే సమయంలో రోడ్డు ఇరువైపులా గోతులు పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఒక్కొక్కసారి చేతికి వచ్చిన పంట నేల రాలి నష్టం కూడా జరుగుతుందని అన్నదాత చెబుతున్నారు. గజానికి ఒక గొయ్యి పడి ఉండుటవలన వర్షాకాలం వస్తే నీరు నిలవడంతో కూలీలు జారి పడుతున్నారు,బైక్‌ల నుంచి కూడా పడిన సందర్భాలు ఎన్నో కురుస్తున్న వర్షాలకు మెరక పొలాల నుండి పల్లపు ప్రాంతంలో ఉన్న గోతులలో నీరు నిలవడంతో స్థానిక రైతులు ఆర్థిక సహాయంతో గుంతలను పూడ్చుకుంటున్నారు. పుంత రోడ్డులో ఇరువైపులా తుప్పలు యేపుగా పెరిగి పోవడంతో రహదారి కనిపించడం లేదని చీకటి పడితే పొలాల నుండి పని ముగించుకుని ఇంటికి వెళ్లే కూలీలు భయాందోళనకు గురవు తున్నామని అన్నారు. ప్రజా ప్రతినిధులు చొరవ చూపి గ్రామీణ ప్రాంతాలలో సమస్యలపై దృష్టి చారించాలని ప్రజల కోరుకుంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద పెరిగిన తుప్పలను తొలగించాలని అధికారులకు విన్నవించుకుంటున్నారు. శ్రీరంగపట్నం నుంచి బర్కిట్ నగరం వెళ్లే పుంత రోడ్డు అధికారులుపరిశీలించి కంకర రోడ్డు మార్గం నిర్మించాలని కోరారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి రహదారులపై దృష్టి చారించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా రాయల పట్టాభిషేకం వేడుకలు



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** తెలుగు జాతి గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేసిన సాహితీ సమరాంగణ సార్వభౌముడు ,శ్రీకృష్ణదేవరాయల 516 వ పట్టాభిషేకమహోత్సవ వేడుకలు స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ వద్ద శ్రీ కృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు యర్రంశెట్టి వెంకట రత్నం ఆద్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.శ్రీ కృష్ణ దేవరాయల విగ్రహానికి ముఖ్య అతిథులు,ఆహ్వానితులు యు కె ఎస్ సి గవర్నర్ పెనుమాక రామ్మోహన్,అధ్యక్షులు కానూరి ప్రభాకర్ (జీ బాబు) మాంటిస్సోరి విద్యాసంస్థలు చైర్మన్ మద్దాల వాసు, కాపు నాయకులు అడబాల వెంకట రమణ,వంగా నరసింహారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈసందర్భంగా సేవాసమితి అధ్యక్షులు యర్రంశెట్టి వెంకటరత్నం మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయల జయంతి, వర్ధంతులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి ప్రతీ ఏటావారం రోజులపాటు నిర్వహించాలని, కూటమి ప్రభుత్వానికి ప్రజల పక్షాన ఆయన విజ్ఞప్తిచేశారు.ఈ కార్యక్రమంలో మాడభూషి కృష్ణప్రసాద్, జి ఎస్ ఎన్ మూర్తి,ప్రతాప్‌రాజు,ఉన్నమట్ల కపర్ది,కటారి నాగేంద్ర, గుండుమోగుల వీరాస్వామి,గంటా శ్రీను,కొల్లి నరసింహ మూర్తి, రాయి సూరిబాబు, చెరుకూరి శ్రీనివాస్,ఇనుకొండ శేషాద్రి, మండేల రజనీ, మండేల పెద్ద, బోనం మునసబు, చెవాకుల నరేష్ బాబు, మండేల పణి యాతం రమేష్ ,పినిశెట్టి శ్రీనివాస్,కలిదిండి వెంకటపతి వర్మ,గందం యేసు,యర్రంశెట్టి బుజ్జీ, వేరుకొండ దుర్గాప్రసాద్, కొండ్రెడ్డిసూరిబాబు మద్దాల ముత్తాజీ రావు దొడ్డా ఏడుకొండలు, నల్లమోతు ప్రసాద్, రావి చార్వాక్, కర్రా నరసింహారావు, సిరిగినీడి నాగార్జున,ఎడ్లమురళి ,బెల్లంకొండ నరసింహ రావు, దేవరపు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాల బహూకరణ



**పాలకొల్లు, మేజర్ న్యూస్ :** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కనక దుర్గమ్మ అమ్మ వారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించిన న్యాయవాది వైఎస్ఆర్సీపీ స్టేట్ మహిళా విభాగం ప్రధాన కార్య దర్శి కర్రా జయ సరిత,రాష్ట్ర ప్రచార కమిటీ జనరల్ సెక్రటరీ పెచ్చెట్టి కృష్ణాజి,జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమా మహేశ్వర రావు ,జిల్లా చేనేత అధ్యక్షులు వీరా మల్లిఖార్జున,జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ దేవా రాజేష్,వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు మామిడి శెట్టి చిట్టిబాబు ,సుబ్బారాయుడు మురళీ, మహిళా నాయకులు పెచ్చెట్టి లక్ష్మి విమల.కుసుమ ఝాన్సి హేమలత ,పసుపులేటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## వాసవి మాతకు చీర సారె అందించిన ఇంటర్నేషనల్ వాసవి క్లబ్





తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశానుసారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారు పంపించిన చీర సారేను శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నందు ఈరోజు ఉదయం అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగినది. ముందుగా ఆలయ ప్రదక్షణ, అనంతరం అమ్మవారికి పూలు,పండ్లు గాజులు అనిల్ దంపతులు వాసవి మాతకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు పసుమర్తి అనిల్, కార్యదర్శి మండా బ్రహ్మాజీ, కోశాధికారి శ్రీధర్ గుప్తా, శ్రీఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొల్లేపర రాము, కోశాధికారి భోగవల్లి రమేష్, వాసవి క్లబ్ డైరెక్టర్లు మల్లికార్జున రావు, కొనగల్ల సత్యం, మండవల్లి హనుమంతరావు, పూర్వాధ్య క్షులు ఎన్ఆర్ఎల్ గుప్త పాల్గొని అమ్మవారి పూజాది కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.

# పార్టీని మరింత బలోపేతం చేయాలి

### వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు చంద్రశేఖర్



**మొగల్తూరు, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలలోకి తీసుకువెళ్లి వైసిపి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు చిన మిల్లి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాళీపట్నం వెస్ట్ పంచాయతీ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిందని వైసిపి పాలనలో పేదల కోసం అందించిన సంక్షేమ పథకాలు అమలు జరపటం లేదన్నారు. వైసీపీ నాయకులపై కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారని, అక్రమ కేసులు ఎంతో కాలం నిలవవ ని నిజా నిజాలు కోర్టులు తేలుస్తాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. నిత్యం ప్రజలలో ఉండి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. అధ్యక్షులుగా కౌరు ఏడుకొండలును నియమించారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల పార్టీ అధ్యక్షులు రేవు నారాయణరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కొల్లా బత్తుల రవికుమార్, పాల రాంబాబు, దొంగ మోహనరావు, పోతుల రమేష్, కొడాలి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు 'దేశం' నేత నాయుడు నరసాపురం రాక



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు శనివారం నరసాపురం రామన్నారు. రెండు నెలల క్రితం ఉద్యోగం రీత్యా అమెరికా వెళ్లారు.

వారం రోజులపాటు ఆయన నరసాపురం లో ఉంటారు. ప్రభుత్వం తలపెట్టిన సుపరిపాలన తొలి అడుగు, ఈ నెల 15న ప్రారంభించనున్న ఉచిత బస్సు ప్రయాణం తదితర అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. పలు శుభకార్యాల్లోనూ కార్యక్రమాల్లోనూ నాయుడు పాల్గొంటారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి సంకు భాస్కర నాయుడు తెలిపారు.

## మున్సిపల్ ఇన్చార్జి మేనేజర్‌గా మురళీధర్



**నరసాపురం,మేజర్‌న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ కమీషనర్ డైరెక్టర్ పురపాలక పరిపాలన శాఖ వారి ఆదే శములతో గుణ్ణం మురళీధర్ మున్సిపల్ ఇంచార్జ్ మేనేజర్‌గా కొనసాగనున్నారు. ఆయన ప్రస్తుతం మున్సిపల్ ఆఫీసులో రేవేన్యూ ఆఫీసర్ పనిచేస్తున్నారు. శుక్రవారం ఇంచార్జ్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

**డాక్యుమెంట్ పోయినది**

చింతపల్లి మహారధి కర్ణ కుమార్, తండ్రి :వెంకట్రావు వయస్సు 54 సం॥, డి.నెం.: 2-79 మాదేపల్లి గ్రామం ఏలూరు మండలం, ఏలూరు జిల్లా, నాకు గల ఆర్.ఎస్.నెం : 42823/ 2024 డేట్ అక్టోబర్ నెల 21 వ తేదీన 2024 సం॥ ఏలూరు సబ్ రిజిష్టర్ పరిధిలో ఈ నెంబరు గల ఒరిజినల్ డాక్యుమెంటు నుండి లింకు డాక్యుమెంటు చింతపల్లి దుర్గ, భర్త : సత్యనారాయణ, ఆర్.ఎస్.నెం.: 3318/2004 గల డాక్యుమెంటు ఇది. 2-07-2025 మా ఇంటి నుండి అనగా మాదేపల్లిలో గల సెంటర్‌కు ఫోటోస్టాట్ తీయించుటకు వెళ్ళగా మాదేపల్లి లోనె పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా పైన పేర్కొన్న లింకు డాక్యుమెంటు దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

ఇట్లు, చింతపల్లి మహారధి కర్ణ కుమార్,
మాదేపల్లి, ఏలూరు మం., సెల్ నెం. 9848414218.

# విద్యార్థినిలకు ల్యాప్ టాప్‌లు,వ్యాపారులకు తోపుడు బండ్లు






– అందజేసిన ఎమ్మెల్యే బడేటి చంటి

**ఏలూరు,మేజర్ న్యూస్ :** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి భరోసా ఇచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో ముగ్గురు విద్యార్థినిలు చదువు అవసరం నిమిత్తం ల్యాప్ టాప్‌లు అడిగారు.చిరు వ్యాపారులు ఉపాధి నిమిత్తం తోపుడు బండ్లు అందజేయాలని కోరారు.వారి సమస్యను విన్న ఎమ్మెల్యే శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ముగ్గురు విద్యార్థినిలకు ల్యాప్ టాప్‌లు,చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడం ద్వారా వారు అభ్యున్నతి చెందే అవకాశం ఉంటుందన్నారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శాకంబరీగా అలంకరణలో కుంకుళ్ళమ్మ





**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమై శాకంబరీ దేవి గా క్షేత్ర దేవత కుంకుళ్ళమ్మ వారు శుక్రవారం ఉదయం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు.శ్రావణ మాసంలో మూడు వ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారు ఈ విశేష అలంకారంలో భక్తులను కటాక్షించారు.ముందుగా ఆలయంలో హోమాలు, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహించి నక్షత్ర హారతిలు సమర్పించారు.

వివిధ రకాల పండ్లు కూరగాయలు ఆపిల్, దానిమ్మ,ద్రాక్ష, నిమ్మ, బత్తాయి, పైనాపిల్ వంటి ఫలాలతో పాటు క్యారెట్, బంగాళాదుంప, బెండ, దొండ, వంకాయ,క్యాప్సికం,బీరకాయ వంటి కూరగాయలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు.అలాగే ఆలయాన్ని సైతం పండ్లు కూరగాయలు తో సుందరంగా తీర్చిదిద్దారు. ఫలాలు, కూరగాయలతో శాకాంబరీ అలంకారంలో ఉన్న కుంకుళ్ళమ్మ అమ్మ వారికి అర్చకులు పసులూరి భైరవ స్వామి విశేష పూజలు జరిపి హారతులు సమర్పించారు.శాకాంబరిగా ఉన్న అమ్మవారిని దర్శిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని ఆయన భక్తులకు వివరించారు.నమ్మకం తో అధిక సంఖ్యలో మహిళలు,భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఆలయం మహిళా భక్తులతో సందడిగా మారింది.

# నేడు గుడిగుంట సబ్ స్టేషన్‌లో విద్యుత్‌కు అంతరాయం

**పెదవేగి,మేజర్ న్యూస్ :** పెదవేగి మండలం, గుడిగుంట సబ్ స్టేషన్ నుండి ముందూరుకు వెళ్లే 33 కేవీ లైన్ ఆర్‌డిఎస్ఎస్ పథకంలో క్రొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం ఈ నెల 9వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేద్కర్ ప్రకటనలో తెలిపారు.

వ్యవసాయానికి కరెంటు ఉదయం 3 గంటల నుండి 10 గంటల వరకు,రాత్రి 10 నుండి 12 గంటల వరకు ఇవ్వబడును,కనుక రైతు సోదరులు గమనించాలని,గృహ వినియోగదారులకు ఎటువంటి అంతరాయం కలగదని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# యువకుడి మానసిక పరిస్థితి నుంచి ప్రాణాలు రక్షించిన పోలీసులు




**కైకలూరు,మేజర్‌న్యూస్ :** తడికలపూడి గ్రామానికి చెందిన ఒక యువకుడి మనస్తాపం చెంది ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంటానని తన బంధువులకు సమాచారం అందించిన వెంటనే ఉండి ,ఆకివీడు పోలీసు వారి సమాచారాన్ని కైకలూరు టౌన్ ఎస్సై శ్రీనివాస్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజుకు అందించి వ్యక్తి థామస్‌ను కనుగొని అతనికి కౌన్సిలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు. తడికలపూడి గ్రామానికి చెందిన అందుగుల థామస్ 20 తండ్రి లక్ష్మణరావు,వ్యక్తిగత కారణాలతో తీవ్ర మానసిక ఆవేదనకు లోనై యువకుడుని కాపాడేందుకు సంఘటన స్థలములో పోలీసులు సమయ స్పూర్తితో స్పందించి అతని ప్రాణాన్ని రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నవి అందుగుల థామస్ శుక్రవారం ఉదయం ఆప్టింగ్ డ్రైవింగ్ నిమిత్తం గా భీమవరం మావుళ్ళమ్మ గుడికి వెళ్లి అక్కడ నుంచి తన కజిన్ అయిన రత్నారావుకి ఫోన్ చేసి ఇంటి వద్ద జరిగిన గొడవ కారణంగా తాను అవమానంగా ఫీల్ అవుతున్నానని, ఇక బ్రతకలేనని, చనిపోతానని తెలియజేశాడు. ఈ విషయంపై అలర్ట్ అయిన రత్నారావు తక్షణమే అతని ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశంతో 112 ఎమర్జెన్సీ సేవలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం ఆధారంగా, ఆకివీడు ఎస్ఐ నాగరాజు విషయాన్ని కైకలూరు టౌన్ ఎస్ఐ శ్రీనుకి తెలియ చేసి,థామస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నాడని అనుమానంతో వెంటనే బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు ఆధ్వర్యంలో బస్సు తనిఖీల్లో అతడిని గుర్తించి స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం అతని తండ్రికి ఫోన్ చేసి పిలిపించి,థామస్‌కు కౌన్సిలింగ్ నిర్వహించి, మానసికంగా స్థిరంగా ఉన్నట్టు నిర్ధారించిన తర్వాత అతడిని తండ్రికి అప్పగించారు. విషయంపై కుటుంబ సభ్యులు టౌన్ పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియచేశారు.ఈసందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో సమస్యలు తాత్కాలికమే,కానీప్రాణం ఓ అమూల్యమైన వరం.దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని,ఏ క్షణంలో నైనా పోలీసుల సహాయం సహకారం అవసరమైతే 112 ను సంప్రదించండి అని తెలియ చేశారు.

## భాష్యం పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు



**పెనుగొండ,మేజర్ న్యూస్:** పెనుగొండ భాష్యం పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ ఎన్ వి అప్పారావు మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల ఆధునిక కాలంలో యాంత్రిక జీవనం అలవాటై మనిషికి మనిషికి మధ్య ఆప్యాయత అనురాగాలు దూరమవుతున్న తరుణంలో మానవీయ సంబంధాలను పటిష్టం చేయడానికి, పరస్పర సోదర భావాన్ని, స్నేహభావాన్ని పెంచుతూ, విద్యార్థుల్లో శాంతి, సౌభ్రాతృత్వం పరిమళింప చేయడానికి తమ వంతు ప్రయత్నంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తమ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను విద్యార్థులు నిర్వహించారని తెలియజేశారు.అనంతరం విద్యార్థులంతా చక్కని ఆటపాటలతో అలరించి, తన సోదరులందరికీ రాఖీలను కట్టి మిఠాయిలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇంచార్జ్ శ్రీమన్నారాయణ రెడ్డి,చాంప్స్ ఇంచార్జ్ రాణి రోజాజీ ,ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## యాసిడ్ లోడ్ ఆటో బోల్తా

### : ద్విచక్ర వాహనంపై వెలుతున్న మహిళ మృతి



**పెదపాడు,మేజర్ న్యూస్:** గుంటూరు నుండి ఏలూరు బంగారు దుకాణాలకు యాసిడ్ లోడ్ తో వెళ్తున్న ఆటో తిరగబడి ఆటో ప్రక్కనే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తల పై యాసిడ్ పడి భార్య ఘటన స్థలంలోనే మృతి చెందింది. భర్త తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో తాళ్లమూడి వద్ద ఏలూరు జాతీయ రహదారిలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది.

వృత్తిరీత్యా గుంటూరు నుండి ఏలూరు బంగారు దుకాణాలకు యాసిడ్ విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్న భార్యాభర్తలు. ఘటనా స్థలానికి చేరుకున్న పెదపాడు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## నేడు జరిగే ఆదివాసి దినోత్సవానికి తరలిరండి



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని ఆగస్టు 9 శనివారం ఘనంగా నిర్వహిస్తున్నామని గోండ్వానా దండకారణ్య పార్టీ రాష్ట్ర కార్యదర్శి మడకం వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టీ.గంగన్నగూడెం పరిధిలో తన వ్యవసాయ క్షేత్రంలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమం కోసం కృషి చేసిన ముద్దుబిడ్డలు బిరసాముండా, కొమరంభీమ్, రాంజీ గొండ్ లకు ఘన నివాళులర్పించడం జరుగుతుందని అన్నారు. తాను చేపట్టే ఈ కార్యక్రమానికి గిరిజనులు ఆదివాసీలు అభిమానులు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

# నేడు కొప్పాక సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**పెదవేగి,మేజర్‌న్యూస్ :** పెదవేగి మండలం, విజయరాయి సెక్షన్ కొప్పాక సబ్ స్టేషన్ పరిధిలోఉన్న అమ్మపాలెం,పెదకడిమి కొప్పాక,అంకన్న గూడెం, గ్రామాలకు సబ్ స్టేషన్ మరమ్మత్తుల నిమిత్తం ఈనెల 9వ తేదీ శనివారం ఉదయం 8గంటల నుండి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కనుక వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# గంట వ్యవధిలో రూ.6,75.లక్షల ఎల్,ఓ,సి. మంజూరు పత్రాలు





– అందించిన మంత్రి కొలుసు పార్థసారధి

**నూజివీడు,మేజర్ న్యూస్:** పేదల మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం వేల కోట్లు కేటాయించిందని,అపత్కాలంలో ఉన్న నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి, అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో చాట్రాయి మండలం తుమ్మ గూడెం గ్రామానికి చెందిన ఎమ్,రాంబాబు కుటుంబానికి రూ,1.75లక్షలు, ఆగిరిపల్లి మండలం ఎస్, ఏ, పేట గ్రామనికి చెందిన డి, గంగరాజు కుటుంబానికి రూ,50వేలు, ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామనికి చెందిన పి,సంధ్య, కుటుంబానికి రూ,3 .లక్షల, ముసునూరు మండలం చెల్లిబోయిన గ్రామానికి చెందిన కే, వెంకటేశ్వరరావు బాధిత కుటుంబానికి రూ,1.50లక్షల. ఇలా నలుగురి కుటుంబాలకు గాను,రూ,6.75లక్షల విలువైన ఎల్, ఓ, సి.లను,బాధిత కుటుంబాలకు అందజేసిన మంత్రి బాధిత కుటుంభాలు తాము ఒక ప్రవేట్ హాస్పటల్లో చికిత్స పొందుతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని మెరుగైన వైద్యం కోసం మంత్రి అడుగగా మంత్రి తక్షణమే ఎల్,ఓ,సీ, పత్రాలు మంజూరు చేయించి బాధిత కుటుంబాలకు అందజేశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు గతంలో వైద్యంచేయించుకొని ఉన్న బిల్లులను ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ చేసుకోవచ్చని అన్నారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు వైద్యం చేయించుకున్న బిల్లులను మా కార్యాలయంలో అందజేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సహాయం వెంటనే అందజేస్తానన్నారు.

# కేంద్ర ప్రభుత్వ భారత్ అభియాన్‌కు 'ఛాంబర్స్' ఎంపిక



**పాలకొల్లు, మేజర్ న్యూస్ :** స్థానిక బి ఆర్ ఆర్,జికెఆర్ చాంబర్స్ డిగ్రీ కళాశాల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేయబడుతున్న ఉన్నత భారత అభియాన్ స్కీంకు ఎంపికైనదని, కేంద్రం తరపున ఉన్నత భారత అభియాన్ రీజనల్ కోఆర్డినేటర్ ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నం, కళాశాలను సందర్శించారు. కళాశాల ఆధ్వర్యంలో దిగమర్రు, గోరింటాడ, చందపర్రు, చింతపర్రు, లంకలకోడేరు గ్రామాలను దత్తత గ్రామాలుగా ఎంచుకోవడం జరిగినదని,ఈ కార్యక్రమంలో భాగంగా ఈ గ్రామాలలో అభివృద్ధి,సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రీజనల్ కోఆర్డినేటర్ తెలియ జేశారు.ఈ సందర్భంగా రీజనల్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ ఛాంబర్ కళాశాల యాజమాన్యం నిబద్ధత, తగినంత సిబ్బంది వనరులు విద్యార్థులలో చురుకుతనం, నైపుణ్యం,ఎన్.ఎస్.ఎస్ యూనిట్ల పనితనం అత్యంత మెరుగుగా ఉండటం పరిగణలోకి తీసుకుని ఈ కార్యక్రమానికి చాంబర్స్ కళాశాలను ఎంచుకోవడం జరిగింది అని అన్నారు.కళాశాల చైర్మన్ కె.వి.ఆర్ నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా తమ కళాశాలకు అవకాశం ఇవ్వడం తద్వారా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వాలంటీర్లకు సామాజిక సేవా దృక్పథం మరింతగా అభివృద్ధి చెంది దేశం ఉన్నతికి తమ వంతు సహాయపడతారని అన్నారు.కళాశాల సెక్రటరీ, కె.వి.సీతారామరాజు,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వెంకటేశ్వరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కోఆర్డినేటర్‌గా ఉషశ్రీని ఎంపిక చేయడం జరిగింది. ఎన్ఎస్ఎస్ అధికారులు రాంబాబు, రాధా మాధవి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ట్రస్ట్ ద్వారా మంజూరైన చెక్కును కమిటీ సభ్యులకు అందజేత





**కలిదిండి/కైకలూరు,మేజర్ న్యూస్,** ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ కలిదిండి మండలం చిన్న తాడినాడ పంచాయితీ పల్లెపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. అనంతరం దేవస్థానం నిర్మాణం కొరకు మరియు దూప దీప నైవేద్యం కొరకు టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరైనా రూ.10లక్షలు చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ కి ఆలయ నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెద్ద తాడి నాడు గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీ హరి హర సుతుడు అయ్యప్ప స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగం పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** విద్యుత్ వినియోగం పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ ఎ ఈ కొల్లాబత్తుల మధుకుమార్ (నరసాపురం) అన్నారు. ఆచంట సబ్ డివిజన్ విద్యుత్ సిబ్బందికి, విద్యుత్ వినియోగదారులకు అవగాహన పెంపొందించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేకంగా అవగాహన సదస్సును మండలంలోని మార్టేరు శ్రీ వేణుగోపాలడిటోరియం నందు గురువారం సాయంత్రం నిర్వహించింది.ఈ సదస్సుని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.విద్యుత్ వినియోగదారులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని వారికి కావాల్సిన సమాచారం ఎప్పటికప్పుడు ఇవ్వాలని వినియోగదారుల నుండి కంప్లైంట్ వస్తే ఆ ఉద్యోగిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మధు కుమార్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రతి నిధులు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.రామ కృష్ణ, పెనుమంట్ర అసిస్టెంట్ ఇంజనీర్ జీ.జే.జె నాగరాజు, ఆచంట అసిస్టెంట్ ఇంజనీర్ రామారావు, పెనుగొండ అసిస్టెంట్ ఇంజనీర్ రాంబాబు, ఆచంట నియోజకవర్గం లోని అన్ని విద్యుత్ డివిజన్ లకు చెందిన లైన్మెన్లు పాల్గొన్నారు.సదస్సులో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యుత్ సిబ్బంది, అవగాహన కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందనను రేకెత్తించింది.

## విశ్వదుర్గేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం పట్టణంలోని 17వ వార్డులో గల విశ్వదుర్గేశ్వరి మాత ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూని రెడ్డి ప్రసాద్ విమల దంపతులు అమ్మ వారికి అలంకరణతో అవసరమైన పూలదండలు అందజేశారు.పూడి సత్తిబాబు సహకారంతో అమ్మవారికి గులాబీలు దండలు అలంకరించారు. నాగమణి నందిని లక్ష్మీ దుర్గ పలువురు భక్తులు అమ్మవారికి ప్రసాదాలు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## పాముల దిబ్బలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** పాములదిబ్బలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పాముల దిబ్బలో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఓ వ్యక్తి హత్య నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు ఉంటాయని ముందుగానే దృష్టి సారించామని,సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసామని తెలిపారు. అగ్నిప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కూడా ఆదేశించామన్నారు.ఈ కార్యక్రమంలో ఈడ చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్,ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి,టూ టౌన్ సిఐ అశోక్ కుమార్,టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, పలివెల కిషోర్ పాల్గొన్నారు.

# చింతలపూడి ఎత్తిపోతల పథకం సత్వరం పూర్తి





**– నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి**

**– మార్క్సిస్ట్ మేధావి, దారి దీపం సంపాదకులు డి.వి.వి.ఎస్.వర్మ**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** చింతలపూడి ఎత్తిపోతల పథకంతోనే ఏలూరు జిల్లాలో మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మార్క్సిస్ట్ మేధావి,దారి దీపం ప్రధాన సంపాదకులు డి.వి.వి. ఎస్.వర్మ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సిపిఐ కార్యాలయం స్ఫూర్తి భవనం నందు జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా సమగ్ర అభివృద్ధిపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. అతిధులను జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు వేదిక పైకి ఆహ్వానించారు. ఈ సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న డివివిఎస్ వర్మ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం అధ్యయనం చేసి జిల్లా అభివృద్ధికి తగిన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జిల్లాలో 4 వేల కిలోమీటర్ల విస్తీర్ణం ఉండగా 60 శాతం వ్యవసాయరంగం,15 శాతం ఉద్యాన పంటలు,10 శాతం ఆక్వా రంగం 25శాతం వివిధ రకాల వాణిజ్య పంటలు పండుతున్నాయని తెలిపారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ సిపిఐ శత వార్షికోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు మహాసభలు జరుపుతున్నామని, ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలలో జిల్లా సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కొల్లేరును 5వ కాంటూరులోనే కొనసాగాలని సిపిఐ తొలి నుండి డిమాండ్ చేస్తుందన్నారు. మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మాణం చేయాలని, ప్రాజెక్టు నిర్వాసితులకు మండలాన్ని ఒక యూనిట్ గా తీసుకొని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు,విశ్రాంత తాసిల్దార్ గుబ్బల నాగేశ్వరరావు,విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ మాట్లాడారు. ఈ సదస్సులో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శ్రీనివాస్ డాంగే,బాడిశ రాము, జేవీ రమణ రాజు,వరక శ్యామల,ఉప్పులూరి హేమ శంకర్, తొర్లపాటి బాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నవ యామిని, నగర అధ్యక్షురాలు కొండేటి బేబి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కంచర్ల గురవయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ,సిపిఐ జిల్లా సమితి సభ్యులు గోలిమే బాల యేసు,సిపిఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శులు కురెళ్ళ వరప్రసాద్,అడ్డగర్ల లక్ష్మి ఇందిరా,ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు,పి కిషోర్, విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వరాలమ్మ తల్లి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే బడేటి చంటి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక అశోక్ నగర్ ఏటిగట్టు వద్ద శ్రీ వరాలమ్మ తల్లి జాతర మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి). ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి,ఈడా చైర్మన్ పెద్ది బోయిన శివప్రసాద్ ,కార్పొరేటర్ పృధ్వి శారద,క్లస్టర్ ఇంచార్జ్ నాయుడు సోము,గుడి కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి : ఆరుగురు అరెస్టు

**కొయ్యల గూడెం,మేజర్ న్యూస్ :** పోలవరం డిఎస్పి ఎం వెంకటేశ్వరరావు ఆదేశాలపై పోలవరం సిఐ బాల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కొయ్యల గూడెం ఎస్ఐ చంద్రశేఖర్‌కి రాబడిన సమాచారం మేరకు వారి సిబ్బందితో కలిసి అంకాలగూడెం గ్రామం శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు.

పేకాట నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి 40,130 రూపాయలను స్వాధీనం చేసుకొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు కోడి పందాలు,పేకాట నిర్వహిస్తే చట్టప్రకారమేన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా కోడి పందాలు, పేకాటలో నిర్వహిస్తున్నటు వంటి సమాచారాన్ని డయల్ 112కు గాని లేదా ఎస్సై ఫోన్ నెంబర్ 94407 96666నకు సమాచారం అందించిన ఎడల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్‌లో ఇ-కోర్టుల అమలుకు తీసుకున్న చర్యలేంటి ?

**– ఎంపీ పుట్టా మహేష్‌కు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ జవాబు**



**ఢిల్లీ/ఏలూరు,మేజర్ న్యూస్ :** ఇ-కోర్టుల అమలుకు తీసుకున్న చర్యలేంటని పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా లోక్ సభలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు,న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ లిఖిత పూర్వక సమాధానం. దేశంలోని న్యాయస్థానాలన్నింటిలో సాంకేతిక సౌకర్యాలు కల్పించి 'ఈ-కోర్టులు'గా మార్చే ప్రక్రియలో భాగంగా సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన కమిటీతో సమన్వయం చేసుకుంటూ 'ఈ-కోర్టులు' ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఈ-కోర్టుల ద్వారా ఇప్పటివరకు రూ.18.57 లక్షల కేసులు విచారణ జరిగాయని, ఎన్ఎస్‌టిఇపి సాంకేతిక వ్యవస్థ ద్వారా సమన్ల జారీని సులభతరం చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే 188 న్యాయస్థానాలకు 10 నుంచి 100 ఎంబిపిఎస్‌తో కూడిన డబ్ల్యూఎఎన్ కనెక్టివిటీ ఇచ్చామని చెప్పారు. ఈ-కోర్టు ప్రాజెక్టులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫేజ్ 1,2లో హైకోర్టుతో పాటు 598 ఉప కోర్టులు ఈ ప్రాజెక్టు పరిధిలోకి తీసుకురాగా మరో 51 కోర్టులలో కూడా సాంకేతిక సౌకర్యాలు కల్పించే పని జరుగుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 649 కోర్టులు ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 48 కోర్టులు ఈ ప్రాజెక్టు కింద అనుసంధా నించబడ్డాయని కేంద్ర మంత్రి చెప్పారు.

## ప్రతి ఇంట కొలువు దీరిన శ్రీ లక్ష్మీదేవి





**ఏలూరు,మేజర్ న్యూస్:** వాడ వాడలా అమ్మవారి దేవాలయంలో పోటెత్తిన మహిళా భక్తులు,ఎంతో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రీ వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రతి ఇంట కొలువుదీరిన అమ్మవారి ఫోటోలు,అమ్మవారి ప్రతిమలతో చక్కగా అలంకరించుకొని వండిన పిండివంటలతో గారెలు,బూరెలు,చక్కెర పొంగలి,క్షీరన్నం చలివిడి,వడపప్పు, పానకం,వివిధ రకముల ఫ్రూట్స్ వివిధ రకముల పుష్పాలతో అందంగా అలంకరించుకొని ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలను ఘనంగా నిర్వహించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంలో ఆయా ప్రాంతాల్లో ఇరుగు పొరుగు వారిని పేరంటాలుగా పిలుచుకొని ఒకరికి ఒకరు ఇస్తున్నమ్మ వాయనం పుచ్చుకొంటినమ్మ వాయనం అంటూ ఒకరికి ఒకరు తీసుకున్నారు. చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ల వరకు హిందూ సాంప్రదాయాల దుస్తులను ధరించుకొని అమ్మవారి ఆలయాలకు వెళ్లి ఆయా దేవాలయాలలో అర్చకులతో వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలను నిర్వహించుకుని తీర్థ,ప్రసాదాలను స్వీకరించారు.

## యూనియన్ బ్యాంక్‌చే స్వయం ఉపాధి శిక్షణ

**ఏలూరు,మేజర్ న్యూస్ :** యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, సత్రంపాడులో ఈనెల 18వ తేదీ నుండి ఉచితంగా సిసి టి.వి. కెమెరా రిపేరింగ్ 13 రోజులు (పురుషులకు), పుట్టగొడుగుల పెంపకం (%వీబంష్ట్రతీశీశీఎ ఎబశ్రీఅ-జ్ఞ్అశీఅ%) 10 రోజులు (మహిళలకు, పురుషులకు), బ్యూటీ పార్లర్ 31 రోజులు (మహిళలకు),శిక్షణ ఇవ్వబడుతుందని సంస్థ డైరెక్టర్ ఎం.ఫణి కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితమని,శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్టు ఇవ్వబడుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకు నుండి సర్టిఫికెట్,అర్హులైన అభ్యర్థులకు ముద్రలోనుకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. వివరముల కోసం నంబర్లను 99485 65256,95027 23561 సంప్రదించ వచ్చున్నారు.

## ఎస్‌టియు జిల్లా శాఖ ప్రకటన పై ఎమ్మెల్యేకు యుటిఎఫ్ నేతల వివరణ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఎమ్మెల్యే కి ఏలూరు మండల నాయకుడిపై లేని పోనీ ఆరోపణలు చేయడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ జిల్లా అగ్ర నాయకత్వం ఆదేశాల మేరకు (అగ్రనాయకత్వం ఎస్‌టిఎఫ్ఐ మహాసభలలో కలకత్తా నందు ఉండడం వలన) కోశాధికారి రంగమోహన్, జిల్లా కార్యదర్శి ఈడే శివశంకర్ రావు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ సీనియర్ తేర ప్రసాద్ ,ఇతర జిల్లా నాయకత్వంతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే బడేటి చంటిని వారి నివాసంలో యుటిఎఫ్ జిల్లా పక్షాన కలిశారు. ఎస్‌టియు పొంతన లేని, సంబంధం లేని ఆరోపణలపై ఇచ్చిన వినతి పత్రానికి ఎమ్మెల్యే కి రాత పూర్వక ఆధారాలతో సహా సవివరంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# రాష్ట్ర కోకో బోర్డును ఏర్పాటు చేయాలి

## - కిలోకు రూ.500 నుండి రూ.350లకు ధర తగ్గించడం తగదు
## - ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఏబీ వెంకటేశ్వరరావు



**ఏలూరు,మేజర్‌న్యూస్** : రాష్ట్ర కోకో బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కోకో రైతుల సమస్యలపై చర్చించిపలుతీర్మానాలుఆమోదించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు,రిటైర్డ్ డిజిపి ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 10 వేల ఎకరాలకు సంబంధించిన కోకో రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాల వారీగా డైరెక్టర్లను నియమించుకునినాబార్డు ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పిఓ) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఎఫ్‌పిఓ ఏర్పాటుపై ఈనెల 25 తర్వాత పెదవేగి మండలం విజయరాయి లో రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోకో రైతు ఉత్పత్తి దారుల సంస్థలో కోకో రైతులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సంపదను సృష్టించే పంటగా కోకో పంట ఉన్నదని ఈ నేపథ్యంలో కొబ్బరిబోర్డులా రాష్ట్ర కోకో బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ కిలో కోకో గింజలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధర రూ. 500లను క్రమేపి తగ్గిస్తూ రూ. 350లకు కోకో గింజలను కొనుగోలు చేయడం వలన కోకోరేతుల నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతులు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సింహాద్రి గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, గుడిబండి వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పాలడుగుల నరసింహారావు, కోనేరు సతీష్ బాబు,యెలిశెట్టి పాపారావు బాబ్జి, యలమాటి విశ్వేశ్వరరావు, టి.సోమరాజు,ఎస్. ఆర్. కె. జి. చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# చనిపోయిన పామాయిల్ కార్మికుల కుటుంబాన్ని ఆదుకోవాలి

## - నష్టపరిహారం ఇవ్వాలి : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**ఏలూరు,మేజర్‌న్యూస్** : పామాయిల్ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, వీళ్ళను కార్మికులుగా గుర్తించడం లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం జిల్లా కమిటీ తరపున ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పామాయిల్ తోటలో పనిచేసే కార్మికులు సుమారు పదివేల మంది ఉన్నారని వీరిని ప్రభుత్వం కార్మికులకు గుర్తించడం లేదని దుయ్యబట్టారు. పామాయిల్,కోకో రైతులకు పంట గిట్టుబాటు ధర కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడుతున్నట్లే ఆ తోటల్లో పనిచేసే బడుగు బలహీన వర్గాలకు చెందిన పేదలు, వ్యవసాయ కార్మికులు, పామాయిల్ కార్మికులను ప్రభుత్వం గుర్తింపు ఇచ్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఎంపీ ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పామాయిల్, కోకో తోటల్లో పనిచేసే కూలీలు విద్యుత్ షాక్, విషపురుగులు కాటేసి ఈ కాలంలో పిట్టల రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణవారి గూడెంలో పామాయిల్ గెలలు నరుకుతుండగా తడికిమళ్ళ రమేష్ వయసు 30 కరెంట్ షాక్ గురై చనిపోవడం జరిగిందని అన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నవభారత్ ఫ్యాక్టరీ వాళ్లు ట్రైనింగ్ క్యాంపు ఏర్పాటు చేసి గ్రూప్ ఇన్సూరెన్స్ ద్వారా 10 లక్షల రూపాయలు వ్యక్తిగత భీమ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితమే టీ నర్సాపురం గ్రామంలో కరెంట్ షాక్ గురై ఒక కార్మికుడు చనిపోయాడని గుర్తు చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చనిపోయిన కుటుంబానికి 20లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘంగా డిమాండ్ చేశారు.

# విద్యా శక్తిని నిర్బంధం చేయడం తగదు

## - స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ' కాడిశెట్టి '







**ఏలూరు,మేజర్‌న్యూస్** : విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయడం తగదని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి.జె.ఎ.స్టీవెన్ తో కలిసి ఏలూరులోని జి.జె రెసిడెన్సీ నందు జరిగిన ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమం ఐచ్చికంగా నిర్వహించాలని పాఠశాలవిద్య శాఖ డైరెక్టర్ తెలియచేశారని,కానీ కొన్ని జిల్లాల్లో విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధంగా నిర్వహించమనడం సబబు కాదన్నారు.

సాధారణంగా విద్యార్థులు సాయంత్రం నాలుగు గంటలకు మానసికంగా అలసిపోతారని, ఆ సమయంలో విద్యాశక్తి అని చెప్పి ఆదనంగా తరగతులు నిర్వహించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. కావున విద్యాశక్తి కార్యక్రమం గురించి ఎవర్నీ నిర్బంధం చేయవద్దనన్నారు. అకడమిక్ ఫోరంలు తప్పనిసరయితే సీనియర్ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలన్నారు. ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లీవ్ ఎన్ క్యాష్ మెంట్ బిల్లులు పెట్టి సంవత్సరాలు గడుస్తున్నా చెల్లింపులు చేయకపోవడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాల విషయంలో ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. ఈకార్యక్రమానికి ఏలూరు జిల్లా అధ్యక్షుడు కాటి వెంకటరమణ అధ్యక్షత వహించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట ప్రసాద్, గౌరవ అధ్యక్షులు ఉర్ల గంధర్వరావు, అసోసియేట్ అధ్యక్షులు పిట్ట పెట్రిక్ బాబు, మహిళాఅధ్యక్షురాలు జి.సంధ్యారాణి, సీనియర్ నాయకులు కె.బాలరాజు, టిఅంజిబాబు,దాసరి యేసు పాదం, కె.జేమ్స్, డి వరప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

### పిఎం లంకలో సుపరిపాలన తొలి అడుగు



**నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్** : మండలంలోని పెదమైన లంక గ్రామంలో శుక్రవారం సపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొల్లుపెద్దిరాజు, నర్సాపురం మండల పార్టీ అధ్యక్షులు వాతాడమామహేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ శంకరపు వెంకటేష్,చిన్న వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

### నేడే కెఆర్‌పురంలో ఆదివాసీ దినోత్సవం

**ఏలూరు,మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం కోటరామచంద్రాపురం లోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 9వ తేదీ నిర్వహించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ఉదయం9గంటలకు ప్రారంభమవుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు,శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు,జిల్లా కలెక్టర్,వివిధ శాఖల అధికారులు ,ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

### ఆసుపత్రి వద్ద ద్విచక్ర వాహనం చోరీ

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఆసుపత్రి వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనం శుక్రవారం అపహరణకు గురైంది. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాంతానికి చెందిన అమరపు చినబాబు అనే వ్యక్తి తన కుమారుడిని తీసుకొని పట్టణ పరిధిలో గల మైత్రి ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చి ఆసుపత్రి బయట తన వాహనాన్ని పార్క్ చేసి లోనికి వెళ్లి వచ్చి చూసేసరికి వాహనం అపహరణకు గురైంది. వెంటనే వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జాలిపూడి పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలి

- ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) డిమాండ్




**ఏలూరు,మేజర్‌న్యూస్** :ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూని యన్ సమావేశం శుక్రవారం ఏఐటియుసి కార్యాలయం నందు ఏఐటియుసి జిల్లాఅధ్యక్షులు ఆర్ శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి కిషోర్ మాట్లాడుతూ జాలిపూడి పంచాయతీ సిబ్బందికి గత 4 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని వెంటనే ఆ సిబ్బందికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అసలే చాలీసాలని జీతాలతో బ్రతుకుతున్న పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఏ విధంగా పనిచేస్తారని వారు ప్రశ్నించారు. ఇప్పటికే ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్మికులకు బకాయి జీతాలు చెల్లించని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా జిల్లాలో గ్రామ పంచాయతీ కార్మికులు చాలీచాలని అతి తక్కువ వేతనాలతో బతికిడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 10 పదవులు ఏకగ్రీవం

### అధ్యక్షులుగా బూసి విశ్వేశ్వరరావు
### ఉపాధ్యక్షులుగా వైదాని నాగేశ్వరరావు



**నరసాపురం,మేజర్‌న్యూస్:**నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 10 పదవులకు ఎన్నిక ఏకగ్రీవం అయిందని ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసెఫ్ తెలిపారు. నామినేషన్ల ఉప సంహరణ గడువు ముగియడంతో ప్రధాన కార్యదర్శి,కార్యవర్గ సభ్యుల పదవులకు నామినేషన్ వేసిన అభ్యర్థులు పోటీ లో నిలిచారని ఆయన వెల్లడించారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది బూసి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా వైదాని నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జోసెఫ్ తెలిపారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ గా నక్కా ఆనంద్ బాబు, లైబ్రరీ కార్యదర్శి గా నారిన శ్రీనివాసరావు, క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి గా రాయసం రాధారాణి, కోశాధికారి గా పురిళ్ళ శ్రీనివాస్, మహిళా ప్రతినిధి గా గోపిరెడ్డి మణి, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా తంగెళ్ళ వెంకటేశ్వరరావు, కొల్లా బత్తుల చంద్రశేఖర్, మహిళా కార్యవర్గ సభ్యులుగా ఓసూరి జ్యోతి మాంగల్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు.ప్రధాన కార్యదర్శి పదవికి విన్నా సూర్యప్రకాశ్ రావు,రొక్కాల గ్లాడ్ స్టన్ కుమార్, కార్యవర్గ సభ్యుల పదవులకు కొప్పర్తి వెంకట కృష్ణమూర్తి, పులపర్తి హర్షవర్ధన్,గోరింకల వినోద్ కుమార్,కొల్లాటి ఆదినారాయణ, కంభాల స్వర్ణ పోటీ పడుతున్నారని జోసెఫ్ తెలిపారు. ఈ పదవులకు ఈ నెల 13వ తేదీన ఎన్నికలు నిర్వహించి అదేరోజు సాయంత్రం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని జోసెఫ్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయిలో సమీక్ష



**భీమడోలు,మేజర్‌న్యూస్ :** జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ ్రపతాప్ శివ కిషోర్ ఆదేశాలపై సమన్వయ కమిటీ పోలీసు, రవాణా శాఖ ,ఇంజనీరింగ్ శాఖ నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సంయుక్తముగా పరిశీలన చేసిన అధికారులు. జిల్లా పోలీస్ అధికారి కె.ప్రతాప్ శివ కిషోర్,డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాలపై, రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యల భాగంగా సంయుక్త కార్యాచరణ కమిటీ ఏర్పడి భీమడోలు మండలంలో క్షేత్రస్థాయిలో సమీక్ష చేపట్టింది. ఈ కార్యక్రమంలో భీమడోలు ఇన్స్పెక్టర్ యు.జే.విల్సన్,ఎస్సై సుధాకర్,ద్వారక తిరుమల ఎస్సై సుధీర్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కుమారి ప్రజ్ఞా, ఇంజనీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లు గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లు గుర్తించబడింది. వీటిలో అసమాన ఉపరి తలాలు, తగిన డివైడర్లు లేకపోవడం ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. లైటింగ్ లేకపోవడం వలన రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలపై దృష్టి సారించారు.ప్రమాద సూచిక బోర్డు లు, స్పీడ్ బ్రేకర్లు వంటి భద్రతా సూచనలు అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఈ పరిశీలన ఫలితంగా, జాతీయ రహదారులపై ప్రమాదాలు తగ్గించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాతో సమన్వయం కలిగి, తగిన మార్గదర్శకాలను రూపొందించనున్నట్టు అధికారులు తెలిపారు. భీమడోలు ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ వేగం వద్దు ప్రాణం ముద్దు అని ప్రతి ఒక్కరూ గమనించాలని ఒక అరగంట లేటుగా గమ్యస్థానాలకు చేరితే వచ్చే నష్టం ఏమీ లేదని ప్రతి ఒక్కరూ సురక్షితముగా వాహనాలు నడిపేవారు,ఎదుటి వారికి కూడా ఆపాయాలు జరగకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను ధరించాలని కారులో ప్రయాణించే చేసేటటువంటి వారు సీటు బెల్టులను ధరించాలని అవి మీ ప్రాణాలను కాపాడతాయని ప్రతి ఒక్కరు గమనించాలని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలకు సురక్షిత ప్రయాణాలకు అణువుగా పోలీస్ సిబ్బంది తగిన విధమైనటువంటి చర్యలు తీసుకుంటుందని ప్రతి ఒక్కరూ పోలీస్ వారు తీసుకుంటున్న చర్యలకు సహాయ సహకారాలు అందించి సురక్షిత ప్రయాణాలు కొనసాగించాలని సిఐ యు.జె విల్సన్ కోరారు.

# ఓటర్ల హక్కును హరించే
# ఎస్.ఐ.ఆర్.ను ఉపసంహరించుకోవాలి

### - బిజెపి ప్రభుత్వానికి లొంగిన ఎన్నికల కమిషన్ తన వైఖరిని మార్చుకోవాలి




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎన్నికల ప్రజాస్వామ్యానికి ప్రమాదం అని, ఓటర్ల హక్కును హరించే ఎస్ ఐ ఆర్ ను ఉపసంహరించుకోవాలని, కేంద్ర బిజెపి ప్రభుత్వానికి లొంగిపోయే వైఖరిని ఎన్నికల కమిషన్ మార్చుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మత ప్రాతిపదికన పౌరులను విభజించే బిజెపి విధానాలను ప్రజలు ఐక్యంగా ప్రతికటించాలని, పౌరులు ఓటు హక్కును ప్రశ్నించే విధంగా బీహార్లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలని, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘం కేంద్ర బిజెపికి తొత్తుగా మారడం తగదని, ఓటర్ల నమోదుకు పౌరుషత్వంతో ముడి పెట్టరాదని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో భాగంగా శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును తొలగించే విధంగా ఎస్ఐఆర్ ను చేపట్టడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది అన్నారు.ఓటు హక్కు కోసం ఆధార్, పాన్, రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డులను పరిగణలోకి తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.ఎన్.వి.డి ప్రసాద్,పి రామకృష్ణ,నగర కార్యదర్శి పి రవికుమార్, ఇతర సిపిఎం నాయకులు ఏ శ్యామల రాణి,ఎం ఇస్సాకు, కనకారావు, కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం నిరసన





**నర్సాపురం, మేజర్‌న్యూస్:** ఓటర్ల హక్కులను హరించే ఎస్ఐ ఆర్ ను వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. శుక్రవారం జరిగినఈ కార్యక్రమం సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు,పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఎస్,ఐ,ఆర్ (స్పెషల్ ఇంటినేసి రిసీవ్ నెస్) వల్ల దేశంలో కోట్లాదిమంది ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కోల్పోతారన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను బలహీన పరిచే విధంగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికల కమిషన్ను బిజెపి కనుసనల్లో పెట్టుకుని వారికి అనుకూలంగా ఉన్నఓటర్ జాబితాలను రూపొందించుకుంటుం దని విమర్శించారు. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో ఓటర్ జాబితాలలో అవక తవకలు జరిగాయనే అనుమానాలు తేటతెలమవుతున్నాయన్నారు. బీహార్ ఎన్నికల్లో అవలంబించే విధంగా ఎస్,ఐ,ఆర్ ద్వారా లక్షలాది ఓట్లు తొలగించే ఏర్పాట్లు చేయటం రాజ్యాంగ హక్కులను కాలరాయటమేనన్నారు. భారతదేశంలో 18 ఏళ్లు నిండిన పౌరులందరికీ రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును హరించే విధంగా ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వం ఓటర్ జాబితాలో అవకతవకలకు పాల్పడుతున్న విషయాలు పై న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు, నోములకొండ,పొగాకు నారాయణరావు, కొడి లక్ష్మణ్, జి ఆజాద్,మండల కమిటీ సభ్యులు కౌరు నరసింహ స్వామి,పున్నమి అప్పలనాయుడు,పైల అప్పలనాయుడు,కాకర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్ర కాలనిలో డ్రైనేజీ నిర్మాణం చేయించాలి



**కామవరపుకోట,మేజర్‌న్యూస్ :** కామవరపుకోట పంచాయతీ వీరభద్ర కాలనిలో గత కొద్దీ సంవత్సరాలుగా ఇళ్ల లోకి వస్తున్న వర్షపు నీరు మళ్లించుటకు, డ్రైనేజీ నిర్మాణం కొరకు శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ ని కలసి అర్జీ సమర్పించారు. కామవరపుకోట, వీరబాద్ర కాలనీ వాసులు,వారితో పాటు గ్రామ పార్టీ నాయకులు వజీర్ ఖాన్ పాల్గొన్నారు, ఈ సమస్యపై స్పందించిన శాసన సభ్యులు ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపిస్తాను అని హామీ ఇచ్చారు. శాసన సభ్యులు ఇచ్చిన హామీ పై వీరబాద్ర కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## తక్షణం స్పందించిన అగ్నిమాపక సిబ్బంది





**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** తాడేపల్లిగూడెం,ఏలూరురోడ్, సాయిబాబా గుడి సమీపంలోగల కాలనీలోఉదయం6.50 నిమిషాలకు అగ్నిప్రమాదం జరుగుతుందని అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు సమాచారం ఇచ్చారు. కరెంట్ స్తంభమున కు చేర్చి ఉన్న కేబుల్ వైర్లు అగ్నిప్రమాదమునకు గురై కాలిపోతుందని సమాచారం వచ్చిన వెంటనే,అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కార్బన్డయాక్సైడ్ వాయు సహాయంతో అగ్నిప్రమాదమును తమ సిబ్బంది పూర్తిగా అదుపు చేసినట్లు ఫైర్ ఆఫీసర్ మురళి కొండబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.